సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

ఆదివారం । 10 । మార్చి । 2024



సోమశిలలో 14.125 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో శనివారం సాయంత్రానికి 14.125 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వివిధ కాలువలకు 3,000 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.67,920
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.6,100
మూడు శాతం జీఎస్టీతో	రూ.6,283
నవర (8 గ్రాములు)	రూ.50,264

గరిష్టం/కనిష్టం
34.5 /25.5

వాతావరణం

శనివారం గాలిలో తేమ 71 శాతం ఉంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతున్నాయి. ఆదివారం పెద్దగా మార్పులు ఉండబోవని వాతావరణశాఖ తెలిపింది.

న్యూస్‌రీల్

మర్యాదపూర్వకంగా..



మంత్రి కాకాణిని సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి

నెల్లూరు(దర్గామిట్ట): వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి శనివారం రాత్రి రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని, ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డిని నెల్లూరులోని వారి నివాసాల్లో మర్యాదపూర్వకంగా కలిశారు. చంద్రశేఖర్‌రెడ్డి వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన నేపథ్యంలో ఆయనను మంత్రి కాకాణి, ఎమ్మెల్యే మేకపాటి అభినందించారు. ఈ సందర్భంగా వారు పలు అంశాలపై చర్చించారు.

ఇంటర్ మూల్యాంకనం ప్రారంభం

నెల్లూరు(టౌన్): ఇంటర్ పబ్లిక్ పరీక్షలకు సంబంధించి జవాబు పత్రాల మూల్యాంకనం శనివారం నుంచి ప్రారంభించారు. స్థానిక స్టోన్‌హౌస్‌పేటలోని కేపీసీ జూనియర్ కళాశాలలో మూల్యాంకనం నిర్వహిస్తున్నారు. ఇతర జిల్లాల నుంచి వచ్చిన జవాబు పత్రాలను బందోబస్తు మధ్య భద్రపరిచారు. ఈ సందర్భంగా ఆర్ఐఓ శ్రీనివాసులు మాట్లాడుతూ సంస్కృతం పేపర్‌కు సంబంధించి 33 వేల జవాబు పత్రాలు జిల్లాకు వచ్చాయన్నారు. తెలుగు, హిందీ జవాబు పత్రాలు ఇతర జిల్లాల నుంచి వస్తున్నాయన్నారు. తొలిరోజు 56 మంది అధ్యాపకులతో మూల్యాంకనం ప్రారంభమైందని తెలిపారు. ప్రస్తుతం మూల్యాంకనం మధ్యాహ్నం 12.30 నుంచి సాయంత్రం 6 గంటల వరకు జరుగుతోందని, పరీక్షలు ముగిసిన తరువాత ఉదయం 10 గంటల నుంచి ప్రారంభిస్తామని తెలిపారు.

క్రమబద్ధీకరణ ఉత్తర్వుల అందజేత



కాంట్రాక్టు ఉద్యోగులు రెగ్యులర్ అయినట్లు ఉత్తర్వులు అందజేస్తున్న డీఎంహెచ్‌ఓ

నెల్లూరు(అర్బన్): వైద్యశాఖలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తూ చేస్తూ ప్రభుత్వం విడుదల చేసిన జీఓకు అనుగుణంగా శనివారం రాత్రి డీఎంహెచ్‌ఓ పెంచలయ్య పలువురు కాంట్రాక్టు ఉద్యోగులకు రెగ్యులరైజేషన్ ఉత్తర్వులను అందజేశారు. 99 మంది హెల్త్ అసిస్టెంట్లు, మరో నలుగురు ల్యాబ్ టెక్నీషియన్‌లకు ఈ ఉత్తర్వులను అందజేశారు. ఈ సందర్భంగా రెగ్యులర్ అయిన సిబ్బందిని డీఎంహెచ్‌ఓ అభినందించారు. మరికొంత మందికి ఉత్తర్వులు అందజేయనున్నారు.

ఐటీఐలో అప్రెంటిస్‌షిప్ మేళా రేపు

నెల్లూరు(టౌన్): వెంకటేశ్వరపురంలోని బాలుర ఐటీఐలో ప్రధానమంత్రి జాతీయ అప్రెంటిస్‌షిప్ మేళాను సోమవారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నామని ప్రిన్సిపల్ శ్రీధర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. భార్గవి ఆటోమొబైల్స్, ఆర్టీసీ, సీకాప్, గ్రీన్ టెక్, ఎలక్ట్రో స్టీల్, టీవీఎస్, క్యాడ్‌బరీ, మోడరన్ బిల్డర్స్, గోల్డ్‌ఫీల్డ్స్, శరత్ ఇండస్ట్రీస్ తదితర కంపెనీలు హాజరుకానున్నాయని చెప్పారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో వివిధ కోర్సుల్లో ఉత్తీర్ణులైన వారు అర్హులని, తగిన ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలని కోరారు.

రైతు పంట పండింది

ఈ రబీ సీజన్‌లో జిల్లాలో వరి సాగు చేసిన రైతుల పంట పండింది. ప్రాజెక్టుల్లో సాగు నీరు సమృద్ధిగా లేకపోయినప్పటికీ ఉన్న నీటినే రైతులు పొదుపుగా వినియోగించుకుని అధిక దిగుబడులు సాధించారు. అంతేకాక అన్నదాతలు పండించిన ధాన్యానికి ధరలు కూడా అధికంగా లభిస్తుండడంతో వారు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

వర్షాభావ పరిస్థితుల్లోనూ జిల్లాలో వరిసాగు

- గత నెల నుంచి కోతలు
- రబీలో పెరిగిన దిగుబడి
- కల్లాల్లోనే ధాన్యం కొనుగోలు
- 20 శాతం అదనంగా ధరలు



జిల్లాలో..
రబీలో వరిసాగు
విస్తీర్ణం - 2,60,033 ఎకరాలు
దిగుబడి కానున్న ధాన్యం (అంచనా) - 8,11,335 మెట్రిక్ టన్నులు

రైతులు సాగు చేసిన వరి రకం	పుట్టి ధాన్యానికి మార్కెట్‌లో లభిస్తున్న ధర
కేఎన్ఎం-1638	రూ.24 వేలు
కేఎన్ఎం-733	రూ.23,500
బీపీటీ-5204	రూ.22 వేలు
ఎంటీయూ-1010	రూ.17,500
ఎన్ఎల్ఆర్-34449	రూ.19,500



పొదలకూరు మండలంలో రోడ్డుపైనే ధాన్యాన్ని తూకం వేస్తున్న మిల్లర్లు

పొదలకూరు: జిల్లాలో 2023-24 రబీ సీజన్‌లో రైతులు సాగు చేసిన వరి పంట రైతులకు లాభాలను తెచ్చిపెడుతోంది. పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర లభిస్తే సంతోషించే రైతులకు 20 శాతం అదనంగా ధరలు లభిస్తుండడంతో వారి ఆనందానికి అవధులు లేవు. సాధారణంగా జిల్లాలో రబీ సీజన్‌లో కర్షకులు అధిక విస్తీర్ణంలో వరి పంట సాగు చేస్తుంటారు. అయితే ఈ సీజన్‌లో సకాలంలో వర్షాలు కురవకపోవచ్చని రైతులు భావించారు. మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో జిల్లాలో భారీ వర్షాలు కురిసినప్పటికీ చెరువులు నిండాయే తప్ప ప్రాజెక్టుల్లోకి అనుకున్న స్థాయిలో నీరు చేరలేదు. ఐఏబీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాల మేరకు ప్రాజెక్టుల్లో ఉన్న సాగునీటినే ప్రణాళికాబద్ధంగా వరి పంటకు అందించారు. గతేడాది రబీ సీజన్‌తో పోల్చిస్తే జిల్లాలో సాగు విస్తీర్ణం లక్ష ఎకరాలు తగ్గినప్పటికీ రైతులు అవకాశం ఉన్నంతవరకు వరి సాగు చేపట్టారు. ఫలితంగా ఈ రబీలో 2.60 లక్షల ఎకరాల్లో వరి సాగు చేశారు. పంట కోతకు వచ్చి దిగుబడి బాగుండడంతోపాటు ధాన్యం ధరలు కూడా సంతృప్తికరంగా ఉన్నాయి. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల కన్నా మిల్లర్లే 20 శాతం అదనంగా ధరలు చెల్లిస్తుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పుట్టికి రూ.24 వేల వరకు ధర

పొదలకూరు మండలం తాటిపర్తి తదితర ప్రాంతాల్లో ఎకరాకు 5 పుట్ల ధాన్యం దిగుబడి అయినట్లు రైతులు చెబుతున్నారు. మిల్లర్లే అధిక ధరలు చెల్లిస్తుండడంతో కొనుగోలు కేంద్రాలతో పనిలేకుండానే విక్రయించుకుంటున్నట్లు అన్నదాతలు చెబుతున్నారు. కొనుగోలు కేంద్రాల్లో పుట్టి(850 కిలోలు)కి రూ.18 వేలు ధర ప్రకటించగా.. మిల్లర్లు పుట్టికి రూ.24 వేల వరకు చెల్లించి కల్లాల్లోనే కొనుగోలు చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్రం, జాఫర్‌ఖాన్‌పేట, కూనారం వ్యవసాయ పరిశోధనా స్థానం కనుగొన్న కేఎన్ఎం-1638 వరి వంగడాన్ని రైతులు జిల్లాలో అధికంగా సాగు చేసి గిట్టుబాటు ధరలు పొందుతున్నారు.

మునుపెన్నడూ లేనివిధంగా..

పుట్టి ధాన్యం గతేడాది రూ.20 వేల వరకు అమ్ముడుపోతేనే రైతులు ప్రభుత్వాన్ని నెత్తిన పెట్టుకున్నారు. అయితే ప్రతిపక్షాలు రష్యా, ఉక్రెయిన్ యుద్ధం వల్ల ధాన్యానికి డిమాండ్ పెరిగిందని, చైనాకు ఎగుమతి అవుతున్నందున తెలంగాణ మసూరకు ధరలు బాగా వచ్చాయని ప్రచారం చేశాయి. కాగా ప్రస్తుతం రైతులు పండించిన ధాన్యానికి 20 శాతం ధరలు అధికంగా లభిస్తుండడంతో ప్రతిపక్షాలు నోరు మెదపడం లేదు. విమర్శలు చేసేందుకు వీలులేక మిన్నకుండిపోయారు. ఉన్న సాగునీటి వనరులను పొదుపుగా వినియోగించుకుని తాము పంటలు బాగా పండించుకున్నామని రైతులే చెబుతున్నారు. కాగా రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తన సొంత మండలం పొదలకూరులో కండలేరు ఎడమగట్టు కాలువకు కండలేరు జలాశయం నుంచి చివరి తడి నీటిని అందించేలా కృషి చేసి రైతులకు అండగా నిలిచారు. సోమశిల దక్షిణ కాలువకు మెట్టపైర్లు ఎండిపోకుండా నీటిని విడుదల చేయించారు.

ధరలు బాగున్నాయ్



మా ప్రాంతంలో అధిక విస్తీర్ణంలో కేఎన్ఎం-1638 రకాన్ని సాగు చేశాం. రబీ సీజన్‌లో ధాన్యం ధరలు బాగున్నాయి. గిట్టుబాటు ధర కన్నా మిల్లర్లే అదనంగా అందజేస్తున్నారు. దళారుల వ్యవస్థ లేకుండా నేరుగా మిల్లర్లే వచ్చి ధాన్యాన్ని కొనుగోలు చేసి తీసుకెళుతున్నారు.
– కె.రమణారెడ్డి, రైతు, మహ్మదాపురం, పొదలకూరు మండలం

ఎడమ కాలువకు నీరందించారు



కండలేరు ఎడమ కాలువకు చివరి తడి నీరు అందించడం ద్వారా పంటలు పండించుకోగలిగాం. మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి రైతుల అవసరాలను గుర్తెరిగి అడగకుండానే సాగునీటిని విడుదల చేయించారు. రైతులకు అండగా నిలిచిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు.
– వి.దయాకర్‌రెడ్డి, రైతు, పొదలకూరు మండలం

సాగునీరు సమృద్ధిగా ఇచ్చారు



మా పంచాయతీలో 1,200 ఎకరాల్లో వరిసాగు చేస్తే కండలేరు ఒకటో బ్రాంచ్ కాలువ ద్వారా సమృద్ధిగా సాగునీరు అందించారు. పెదరాజుపాళెం, కొనగలూరు చెరువులకు ఇప్పటికీ కాలువ ద్వారా నీరు పారుతూనే ఉంది.
– ఎం.మోహన్‌రాజు, రైతు, దుగ్గుంటరాజుపాళెం

కమనీయం.. మూలస్థానేశ్వరుని కల్యాణం



భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామి కల్యాణోత్సవం నిర్వహిస్తున్న వేదపండితులు

నెల్లూరు(బృందావనం): మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని మూలాపేటలోని శ్రీభువనేశ్వరి సమేత మూలస్థానేశ్వర స్వామి దేవస్థానంలో స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవం శనివారం రాత్రి వైభవంగా జరిగింది. విశేషాలంకారంలో కొలువైన స్వామివారిని అశేషంగా భక్తులు దర్శించుకుని ప్రణమిల్లారు. అనంతరం స్వామివారు నగరోత్సవంలో గజవాహనంపై విహరించారు. కార్యక్రమాలను ఆ దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ లోకిరెడ్డి వెంకటేశ్వర్‌రెడ్డి, కార్యనిర్వహణాధికారి ఆరంబాకం వేణుగోపాల్, ధర్మకర్తల మండలి సభ్యులు పర్యవేక్షించారు.

మూలస్థానేశ్వరుడి రథోత్సవం నేడు

కల్యాణోత్సవం అనంతరం భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామి రథోత్సవం ఆదివారం ఉదయం 9 గంటలకు జరగనుందని ఆ దేవస్థానం కార్యనిర్వహణాధికారి వేణుగోపాల్ శనివారం తెలిపారు.

ఉగాది పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(టౌన్): ఉగాది పురస్కారాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ఆల్ ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ నారాయణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు రాష్ట్రాల్లోని కవులు, కళాకారులు, రచయితలు, విద్యావంతులు, క్రీడాకారులు, సమాజ సేవకులు తమ దరఖాస్తులను ఆల్ ది బెస్ట్ అకాడమీ, 1 – 20 – 164, గోకుల్‌నగర్, వెంకటాపురం, తిరుమలగిరి, సికింద్రాబాద్‌కు ఈ నెల 15లోపు పంపాలని కోరారు. ప్రతిభ సర్టిఫికెట్లు, ఫొటోలను పంపాలని, పురస్కారాలను హైదరాబాద్‌లో వచ్చే నెల ఏడున అందజేయనున్నామని వివరించారు.

వైఎస్సార్‌సీపీ విజయం తథ్యం



వైఎస్సార్ చేయూత నాలుగో విడత నమూనా చెక్కును అందజేస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి

వెంకటాచలం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఉన్న జనాదరణను చూసి తట్టుకునే శక్తి చంద్రబాబుకు లేదని, ఆయన ఎన్ని కుట్రలు చేసినా 2024 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం తథ్యమని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని చెముడుగుంట వద్దనున్న స్రిడ్స్ కల్యాణ మండపంలో శనివారం వైఎస్సార్ చేయూత 4వ విడత నిధుల విడుదల కార్యక్రమంలో మంత్రి కాకాణి పాల్గొని మాట్లాడారు. 2014 ఎన్నికల సమయంలో చంద్రబాబు ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యారని గుర్తుచేశారు. ముఖ్యంగా పొదుపు మహిళలు, రైతులకు రుణమాఫీ చేస్తానని చెప్పిన చంద్రబాబు అధికారం చేపట్టాక మోసం చేయడంతో 2019 ఎన్నికల్లో ప్రజలు ఆయనకు బుద్ధి చెప్పారని తెలిపారు. కాగా 2019 ఎన్నికల సమయంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని పక్కాగా అమలు చేసి ప్రజల అభిమానాన్ని చూరగొన్నారని కొనియాడారు. వైఎస్సార్ చేయూత, ఆసరా, రైతుభరోసా, అమ్మఒడి లాంటి ఎన్నో పథకాలను పారదర్శకంగా అమలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. మహిళలకు ఇచ్చిన రెండు ప్రధానమైన హామీలు వైఎస్సార్ ఆసరా, చేయూత పథకాల ద్వారా రాష్ట్రంలో నేరుగా మహిళల ఖాతాల్లో రూ.45 వేల కోట్లు జమ చేశారని తెలిపారు. వైఎస్సార్ చేయూత నాలుగో విడతలో రాష్ట్రంలో 26,98,931 మంది మహిళలకు రూ.5,060 కోట్లు, జిల్లాలో 1,26,710 మంది మహిళలకు రూ.237.58 కోట్లు, సర్వేపల్లి నియోజకవర్గంలో 16,985 మంది మహిళలకు రూ.31.84 కోట్లు వారి ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. ప్రజలు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు, చంద్రబాబు పాలనకు వ్యత్యాసాన్ని గమనించాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్నికల వాగ్దానాలను అమలు చేయని చంద్రబాబుకు మద్దతివ్వాలా.. ఇచ్చిన ప్రతి హామీని పక్కాగా అమలు చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతివ్వాలా అని ప్రజలు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని సూచించారు. సంక్షేమ పాలన అందించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు మద్దతిచ్చేందుకు సిద్ధంగా ఉండడంతో చంద్రబాబు జనసేన, బీజేపీలతో పొత్తు పెట్టుకున్నాడని తెలిపారు. చంద్రబాబు ఎంత మందితో కలిసి వచ్చినా 2024 ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తిరుగులేని విజయం సాధించడం ఖాయమని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా సర్వేపల్లి నియోజకవర్గానికి సంబంధించి 16,985 మంది మహిళలకు రూ.31.84 కోట్ల నమూనా చెక్కును మంత్రి కాకాణి అందజేశారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి, డెయిరీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చిల్లకూరు సుధీర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ కనుపూరు కోదండరామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మందల వెంకటశేషయ్య, మండల కన్వీనర్ కొణిదెన మోహన్‌నాయుడు, ఎంపీటీసీ సభ్యుడు వేమారెడ్డి రఘునందన్‌రెడ్డి, నాయకులు కొణిదెన విజయభాస్కర్‌నాయుడు, ఆరుగుంట ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఫ్యాన్ జోరు.. సైకిల్ బేజారు

- ఉదయగిరిలో మేకపాటి రాజగోపాల్‌రెడ్డి 'విజయ సంకల్ప యాత్ర'కు బ్రహ్మరథం పడుతున్న ప్రజలు

ఉదయగిరి: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్నాయి. త్వరలో ఎన్నికల షెడ్యూల్ వెలువడే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఉదయగిరి నియోజకవర్గంలో అధికార వైఎస్సార్‌సీపీ ఎన్నికల ప్రచార పర్వంలో దూసుకెళుతుంటే.. టీడీపీ మాత్రం టికెట్ తగవులాటలో కొట్టుమిట్టాడుతోంది. పన్నెండేళ్లుగా నియోజకవర్గంలో టీడీపీని కనిపెట్టుకుని పనిచేస్తున్న బొల్లినేని రామారావును కాదని ఎన్ఆర్ఐ కాకర్ల సురేష్‌కు టికెట్ ఖరారు చేయడంతో బొల్లినేని వర్గీయులు రగిలిపోతున్నారు. కాకర్లకు తాము సహకరించేది లేదంటూ బొల్లినేని వర్గీయులు తెగేసి చెప్పారు. దీంతో కాకర్ల దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ఈ వివాదంతో ఇంతవరకు ఎన్నికల ప్రచారం కూడా ప్రారంభించలేదు. అసంతృప్తులను ఎలా సమన్వయం చేసుకోవాలో అర్థం కాక టీడీపీ అధిష్టానం తల్లడిల్లుతోంది.

ఖంగుతిన్న బొల్లినేని వర్గీయులు

2024లో టీడీపీ టికెట్ ఆశించిన బొల్లినేని రామారావు గత ఆరు నెలలుగా నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటిస్తూ పార్టీ కార్యక్రమాలను చేపట్టారు. అయితే ఊహించని విధంగా టీడీపీ అధినేత చంద్రబాబు కొత్త అభ్యర్థి కాకర్ల సరేష్‌ను రంగంలోకి దింపడంతో బొల్లినేని వర్గీయులు ఖంగుతిన్నారు. కాకర్లపై, పార్టీ అధిష్టానంపై తిరుగుబాటు చేశారు. బొల్లినేని చంద్రబాబును కలిసి అమీతుమీ తేల్చుకుని వస్తానని, అంతవరకు ఓపిక పట్టండి అంటూ తన అనుచరులకు చెప్పి హైదరాబాద్ వెళ్లారు. రెండు వారాలు గడుస్తున్నా బొల్లినేనికి అధినేత అపాయింట్‌మెంట్ దొరక్కపోవడంతో ఆయన అనుచరులు పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉన్నారు. దీంతో టీడీపీ క్యాడర్ అయోమయంలో ఉంది. రెండ్రోజుల్లో బొల్లినేని వచ్చి ముఖ్యనేతలతో సమావేశం ఏర్పాటు చేసి తుది ప్రకటన చేస్తారని తెలుస్తోంది.

'విజయ సంకల్పం'

వైఎస్సార్‌సీపీ ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి 'విజయ సంకల్ప యాత్ర' పేరులో ఎన్నికల ప్రచారం ముమ్మరంగా సాగిస్తున్నారు. ప్రతిచోటా ఆయనకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. గత టీడీపీ పాలనకు, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ పాలనకు మధ్య వ్యత్యాసాన్ని ఆయన ప్రజలకు వివరిస్తూ మరోసారి వైఎస్సార్‌సీపీ పట్టం కట్టాలని రాజగోపాల్‌రెడ్డి కోరుతున్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

• ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు సిటీ: రాష్ట్రాభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త, ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. రూరల్ నియోజకవర్గ పరిధిలోని చింతారెడ్డిపాళెంలో శనివారం ఆయన పర్యటించారు. జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, మేయర్ పొట్లూరు స్రవంతి, డీసీసీబీ మాజీ అధ్యక్షుడు ఆనం విజయ్‌కుమార్‌రెడ్డితో కలిసి సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఎంపీ ఆదాల మాట్లాడుతూ జెడ్పీ చైర్‌పర్సన్ అరుణమ్మ విజ్ఞప్తి మేరకు చింతారెడ్డిపాళెంలో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ఎంపీ నిధుల నుంచి రూ.16 లక్షలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. అవి సరిపోని పక్షంలో జెడ్పీ నుంచి అవసరమైన మేరకు నిధులను మంజూరు చేయాలని అరుణమ్మను కోరారు. ప్రభుత్వం ఇంటింటికీ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. నేడు అవ్వతాతలకు ఇస్తున్న రూ.3వేలు పెన్షన్‌ను భవిష్యత్తులో రూ.4వేలకు పెంచే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, కోఆప్షన్ సభ్యులు సయ్యద్ మొబీనా, రాష్ట్ర వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ కార్యదర్శి సీహెచ్ హరిబాబుయాదవ్, జెడ్పీటీసీ మల్లు సుధాకర్‌రెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ ఆదాల, పక్కన జెడ్పీ చైర్‌పర్సన్ అరుణమ్మ, మేయర్ స్రవంతి

సంక్షేమ పథకాలతో ఆర్థిక భరోసా

• నగర నియోజకవర్గ సమన్వయకర్త ఎండీ ఖలీల్‌అహ్మద్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గడప గడపకు సంక్షేమ పథకాలను అందించి ఆర్థిక భరోసా కల్పించడంతో ప్రజలు సంతోషంగా ఉన్నారని నగర నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, డిప్యూటీ మేయర్ ఎండీ ఖలీల్‌అహ్మద్ పేర్కొన్నారు. నగరంలోని 5వ డివిజన్ బర్మాషెల్‌గుంట, అహ్మద్‌నగర్, తదితర ప్రాంతాల్లో శనివారం ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఖలీల్‌అహ్మద్ మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని వర్గాల సంక్షేమానికి పథకాలు అమలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థల ఏర్పాటు ద్వారా ప్రభుత్వ సేవలను చేరువ చేయడంతో పాటు అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందజేశారని తెలిపారు. నగర నియోజకవర్గంలో ఎమ్మెల్యే అనిల్‌కుమార్ అర్బన్ హెల్త్ సెంటర్లు, సీసీరోడ్లు, ఫ్లైఓవర్, పార్కుల నిర్మాణం, తదితర అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టారని వివరించారు. కొందరు నాయకులు ఎన్నికల సమయంలో బయటకొచ్చి మేమున్నామని చెబుతుంటారని, ప్రజలు ఇబ్బందుల్లో ఉన్న సమయంలో వారు కనిపించరన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సామాన్యుడినైన తనకు ప్రజలకు సేవ చేసేందుకు ఒక అవకాశం కల్పించారని తెలిపారు. తాను నగర ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని, ఎవరికి ఏ సమస్య వచ్చినా ముందుండి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరిచిన ఫ్యాన్ గుర్తుపై ఓటేసి నెల్లూరు పార్లమెంట్ సమన్వయకర్త విజయసాయిరెడ్డితో పాటు తనను ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఓబిలి రవిచంద్ర, పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు అందజేస్తున్న ఎండీ ఖలీల్ అహ్మద్

వృద్ధురాలి అనుమానాస్పద మృతి

నెల్లూరు(క్రైమ్): బాత్‌రూమ్‌లో వృద్ధురాలు అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన ఆలస్యంగా శనివారం వెలుగులోకి వచ్చింది.వివరాలు.. వింజమూరు మండలం తమ్మిదిపాడుకు చెందిన ఎం వేమయ్య, పెద్దసుబ్బమ్మ(75) దంపతులు. వారికి ఎంవీ నారాయణ, కుమార్తె సంతానం. నారాయణ నెల్లూరులోని గాంధీనగర్‌లో ఉంటూ ఆటో నడుపుకొంటూ జీవనం సాగిస్తున్నాడు. వేమయ్య దంపతులు బాకీ నగదు కోసం పదిహేను రోజుల క్రితం ఎన్టీఆర్‌నగర్ సమీపంలోని సరస్వతినగర్‌లో ఉంటున్న బాగా తెలిసిన రాజమ్మ ఇంటికి వచ్చారు. అప్పట్నుంచి అక్కడే ఉంటున్నారు. మూడ్రోజుల కిందట వేమయ్య పింఛన్ కోసం తన స్వగ్రామానికి వెళ్లారు. శుక్రవారం శివరాత్రి పండగ సందర్భంగా రాజమ్మ గుడికి వెళ్లింది. ఆమె భర్త శ్రీనివాసులు అనారోగ్యంతో ఇంట్లోనే ఉన్నారు. రాజమ్మ ఇంటికి వచ్చి చూడగా సుబ్బమ్మ కనిపించలేదు. ఇళ్లంతా గాలించి బాత్‌రూమ్ తలుపు తెరిచే ప్రయత్నం చేయగా లోపల గడియపెట్టి ఉంది. స్థానికులను పిలిచి బాత్‌రూమ్ గడియ పగులగొట్టి చూడగా సుబ్బమ్మ మృతి చెంది ఉంది. మృతురాలి కుమారుడి ఫిర్యాదు మేరకు బాలాజీనగర్ పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హోరాహోరీగా అంతర్ జిల్లాల కబడ్డీ పోటీలు



ఫ్లడ్‌లైట్ల వెలుతురులో తలపడుతున్న కబడ్డీ జట్లు

కోవూరు: మండలంలోని పడుగుపాడులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి క్రీడా ప్రాంగణంలో 70వ అంతర్ జిల్లాల పురుషుల కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫ్లడ్‌లైట్ల వెలుతురులో మూడ్రోజుల పాటు నిర్వహిస్తున్న ఈ పోటీల్లో రెండోరోజు శనివారం పలు జిల్లాలకు చెందిన జట్లు పోటాపోటీగా తలపడ్డాయి.

విజేతలు వీరే..

రెండో రోజు పోటీల్లో చిత్తూరు జట్టు(25పాయింట్లు)పై నెల్లూరు జట్టు (36) విజయం సాధించింది. విజయనగరం జట్టు(29)పై పశ్చిమగోదావరి జట్టు (34) గెలుపొందింది. అలాగే ప్రకాశం జట్టు(21)పై కడప జట్టు విజేతగా నిలిచింది. అనంతపురం జట్టు(26)పై విశాఖపట్నం జట్టు (42) విజయం సాధించింది.

ఆటో ఢీకొని కానిస్టేబుల్‌కు గాయాలు

ఆత్మకూరు: స్కూటర్‌పై వెళ్తున్న కానిస్టేబుల్‌ను ఎదురుగా వేగంగా వస్తున్న ఆటో ఢీకొనడంతో తీవ్ర గాయాలపాలైన ఘటన పట్టణంలో శనివారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. ఆత్మకూరు సబ్‌జైలులో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న రాములు స్కూటీపై ఎల్‌ఆర్‌పల్లిలోని రామాలయం వీధిలో వెళ్తుండగా ఎదురుగా వేగంగా వస్తున్న ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో రాములుకు తీవ్రగాయాలవగా స్థానికులు ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

గోదావరిలో పడి తాపీమేస్త్రి మృతి

నందిపేట్: తెలంగాణ రాష్ట్ర నిజామాబాద్ జిల్లా నందిపేట మండలం ఉమ్మెడ శివారులో గోదావరి నదిలో పడి తాపీమేస్త్రి కొండబోయిన మాధవ్(30) శనివారం మృతి చెందాడు. వివరాలు.. శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా కలిగిరి మండలానికి చెందిన కొండబోయిన మాధవ్ గత కొన్నేళ్లుగా నిర్మల్ జిల్లా లోకేశ్వర్ మండలం వట్టోలిలో ఉంటూ మేస్త్రిగా పని చేస్తున్నాడు. శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా గోదావరి నది తీరంలోని ఉమ్మెడ మహేశ్వరాలయం వద్దకు స్నేహితుడు కర్ర రమేష్‌తో కలిసి శనివారం వచ్చాడు. ఆలయం వెనుక భాగంలోని నదిలో కాళ్లు, చేతులు కడుక్కోవడానికి వెళ్లి ప్రమాదవశాత్తు అందులో పడి మునిగిపోయి మృతి చెందాడు. పోలీసులు గజ ఈతగాళ్ల సాయంతో మృతదేహాన్ని వెలికి తీయించి పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 127
లేయర్ (లైవ్)	: 73
బ్రాయిలర్ చికెన్	: 224
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 250
లేయర్ చికెన్	: 125

నిమ్మధరలు పొదలకూరు (కిలో)



పెద్దవి	: రూ. 85
సన్నవి	: రూ. 75
పండ్లు	: రూ. 30

రేషన్ పంపిణీలో అలసత్వం వద్దు



లబ్ధిదారులతో మాట్లాడుతున్న జేసీ మాధవన్

కోవూరు: ఎండీయూ వాహనాల ద్వారా ఇంటింటికీ రేషన్ సరుకుల పంపిణీలో అలసత్వం వహించకుండా ప్రభుత్వం నిర్దేశించిన సమయంలో అందజేసేలా తగిన చొరవచూపాలని జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్ అధికారులను ఆదేశించారు. కోవూరులోని సత్యవతినగర్ ప్రాంతంలో ఎండీయూ వాహనం ద్వారా రేషన్ పంపిణీని శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులు తమకు కందిపప్పు రావడం లేదని జేసీ దృష్టికి తీసుకొచ్చారు. అందుకు జేసీ స్పందిస్తూ ప్రభుత్వం పంపిణీ చేసే సరుకులను సకాలంలో లబ్ధిదారులకు అందజేయాలన్నారు. ఈ విషయంలో నిర్లక్ష్యం వహించే వారిపై తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎండీయూ ఆపరేటర్లు లబ్ధిదారులను ఇబ్బంది పెట్టకుండా ఇంటి వద్దకే వెళ్లి రేషన్ సరుకులు అందజేయాలన్నారు. ప్రతి నెలా సకాలంలో సరుకులు పంపిణీ చేయాలన్నారు. గోదాములకు స్టాక్ సక్రమంగా రాకపోతే తన దృష్టికి తీసుకురావాలన్నారు.జేసీ వెంట సివిల్ సప్లయిస్ డిప్యూటీ తహసీల్దార్ బాలకోటమ్మ, జిల్లా రేషన్ అసోసియేషన్ కార్యదర్శి కృష్ణారెడ్డి, తదితరులు ఉన్నారు.

సాక్షి ఫ్యామిలీ

IV

నెల్లూరు

ఆదివారం ॥ 10-3-2024



వైరల్

డ్రోన్ దీదీ

హరియాణాకు చెందిన షర్మిల యాదవ్ పెద్ద చదువులు చదువుకోవాలని కల కన్నది. అయితే ఇంటర్మీడియేట్ పూర్తికాగానే 'ఇక చాలు' అన్నారు తల్లిదండ్రులు. పెళ్లి అయిన తరువాత కుటుంబ బాధ్యతల్లో తలమునకలైనప్పటికీ షర్మిలకు చదువుపై ఉన్న ఇష్టం మాత్రం పోలేదు. 'డ్రోన్ సిస్టర్' ప్రోగ్రాంలో భాగంగా మహిళలకు డ్రోన్ పైలట్ ట్రైనింగ్ ఇస్తున్నారని తెలుసుకున్న షర్మిల ట్రైనింగ్ కోర్సులో చేరింది. ఫస్ట్ టెస్ట్‌లో ఫెయిల్ అయింది. ఆ సమయంలో కుటుంబ సభ్యులు 'మరో ప్రయత్నం చెయ్యి' అని ప్రోత్సహించారు. సెకండ్ టైమ్ టెస్ట్ పాస్ అయిన షర్మిల ఇప్పుడు సర్టిఫైడ్ డ్రోన్ పైలట్‌గా గుర్తింపు పొందింది. ఎలాంటి టెక్నికల్ బ్యాక్‌గ్రౌండ్ లేకపోయినా మాస్టరింగ్ కంట్రోల్స్, హైట్ అండ్ స్పీడ్ రీడింగ్, స్మూత్ టేక్-ఆఫ్, ల్యాండింగ్స్...మొదలైన సాంకేతిక విషయాలపై అవగాహన ఏర్పర్చుకుంది. ఇప్పుడు ఆమెను అందరూ 'డ్రోన్ దీదీ' అని పిలుస్తున్నారు. వ్యవసాయానికి సంబంధించిన పనుల్లో డ్రోన్ పైలట్‌గా చేతి నిండా పనితో మంచి ఆదాయన్ని అర్జిస్తోంది. వ్యవసాయ భూముల్లో షర్మిల యాదవ్ డ్రోన్ ఆపరేట్ చేస్తున్న వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

ఈ కార్యక్రమాన్ని మీకు సమర్పిస్తున్నవారు...

యూట్యూబ్ 'సిల్వర్ ప్లే బటన్'ను సొంతం చేసుకోవడం అనేది అంత వీజీ కాదు. లక్ష మంది సబ్‌స్క్రైబర్‌లు ఉన్న కంటెంట్ క్రియేటర్‌లకు యూట్యూబ్ ప్రతిష్ఠాత్మకమైన సిల్వర్ ప్లే బటన్ సొంతం అవుతుంది. అయితే పాకిస్థాన్‌లోని గిల్గిత్-బల్టిస్థాన్ ప్రాంతంలోని ఖప్లూ నగరానికి చెందిన మహ్మద్ సిరాజ్ అనే పిల్లాడు మాత్రం తన యూట్యూబ్ చానల్ 'సిరాజీ విలేజ్ వ్లోగ్స్'తో 'సిల్వర్ ప్లే బటన్'ను అవలీలగా సాధించాడు. సిరాజ్ చానల్‌కు లక్షమంది సబ్‌స్క్రైబర్‌లు ఉన్నారు. చెల్లి ముస్కాన్ ఇతర కుటుంబ సభ్యులతో కలిసి సిరాజ్ చేసిన వీడియోలు పాపులర్ అయ్యాయి. యూట్యూబ్ సిల్వర్ ప్లే బటన్‌ను సిరాజ్ అన్‌బాక్సింగ్ చేస్తున్న వీడియో సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో వైరల్ అయింది.



అమ్మా, నాన్న ఆనంద విహారం



ఇన్‌స్టాగ్రామ్ యూజర్ వివేక్ వాఘ్ సర్‌ప్రైజ్ ట్రావెల్ ప్లాన్‌తో తల్లిదండ్రులను ఆశ్చర్యానందాలకు గురి చేశాడు. 'ఫ్లైయిట్‌లో మనం జైపూర్‌కు వెళుతున్నాం' అని చెప్పి తల్లిదండ్రులను ఎయిర్‌పోర్ట్‌కు తీసుకెళ్లాడు. పాస్‌పోర్ట్‌లను వారి చేతికి అందిస్తూ ఆఖరులో అసలు విషయం చెప్పాడు. తాము వెళుతున్నది జైపూర్ కాదని సింగపూర్‌కు అని తెలుసుకున్న వివేక్ తల్లిదండ్రులు ఆనందంలో మునిగిపోయారు. ఇది వారికి తొలి అంతర్జాతీయ ప్రయాణం. 'సీ దెయిర్ రియాక్షన్... సర్‌ప్రైజ్ ట్రిప్' కాప్షన్‌తో పోస్ట్ చేసిన ఈ వీడియో మూడు లక్షలకు పైగా వ్యూస్‌ను సొంతం చేసుకుంది.

సోషల్ మీడియా యూజర్‌లు, సెలబ్రిటీలు ఈ వీడియోను చూసి ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. యాక్టర్ జై భానుశాలి 'ప్రౌడ్ సన్. విషయం తెలిసిన తరువాత మీ తండ్రి ఇచ్చిన ఎక్స్‌ప్రెషన్ నాకు ఎంతగానో నచ్చింది. మా అబ్బాయి మమ్మల్ని సింగపూర్ తీసుకువెళ్లాడు అని ఆయన గర్వంగా స్నేహితులతో చెప్పుకోవచ్చు' అని కామెంట్ పెట్టారు.

ఏ డే ఇన్ మై లైఫ్...



గూగుల్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ సలోని రకోహోలియా 'ఏ డే ఇన్ మై లైఫ్ ఎట్ గూగుల్' కాప్షన్‌తో పోస్ట్ చేసిన వీడియో 2.4 మిలియన్‌ల వ్యూస్‌ను దక్కించుకుంది. ఉదయం ఇంటి నుంచి బయలుదేరడం నుంచి గూగుల్ ఆఫీసులోకి అడుగు పెట్టడం, చెక్ అప్‌డేట్స్, బ్రేక్ ఫాస్ట్, ప్లాన్ ఫర్ ది డే అండ్ వర్క్, గెట్ సమ్ వాటర్ అండ్ స్నాక్స్, కోడ్ అండ్ అటెండింగ్ మీటింగ్స్, కొద్ది సమయం పుస్తకం చదవడం, టేబుల్ టెన్నిస్ ఆడడం, వర్క్ చేస్తూ స్నాక్స్, కాఫీ ఆస్వాదించడం. వర్క్‌కోడ్, డిజైన్, డిస్కస్, మ్యూజిక్ రూమ్‌లో కొద్దిసేపు గడపడం, జిమ్‌లో కొద్దిసేపు ఎక్సర్‌సైజ్, కోడింగ్ సెషన్‌లు, సాయంత్రం ఆఫీసు నుంచి తిరిగి ఇంటికి వెళ్లడం...ఇలాంటి దృశ్యాలెన్నో ఈ వీడియోలో కనిపిస్తాయి. ఆఫీస్ జిమ్‌లో క్విక్ వర్కవుట్ సెషన్‌లాంటి వెల్-టైమ్‌డ్ బ్రేక్స్‌ను ఈ వీడియో హైలైట్ చేస్తుంది.

ఇచట డిజిటల్ ఆమ్లెట్ డిజిటల్ పరోటా వేయబడును

అమ్లెట్లు ఎచట వేసెదరు? ఆలూ పరాట ఎక్కడ తయారుచేసెదరు?' అనే ప్రశ్నలకు 'ఇవి కూడా ప్రశ్నలేనా. స్టవ్ మీద ఉన్న పెనంపై వేస్తారు. చేస్తారు' అంటాం. అయితే ఒక టెక్ కంటెంట్ క్రియేటర్ మాత్రం మనం చెప్పే జవాబును మార్చే ప్రయత్నంలో ఉన్నాడు. సదరు ఈ క్రియేటర్ కంప్యూటర్ 'సిపియు'పై ఆమ్లెట్ వేశాడు. ఆ తరువాత మినీ పరోటా తయారుచేశాడు. వైరల్ అవుతున్న ఈ వీడియోను చూసి 'డిజిటల్ ఆమ్లెట్లు-పరోటాలు వచ్చేశాయి' అని మురిసిపోతున్నారు ప్రేక్షకమహాశయులు.



ఆహా...పోహా

ప్రపంచవ్యాప్తంగా ఎంతోమంది బ్లాగర్స్ మన దేశానికి వచ్చి స్థానికులతో హాయిగా కలిసిపోతారు. ఆ జ్ఞాపకాల వీడియోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తుంటారు. తాజాగా మన దేశానికి వచ్చిన రష్యన్ బ్లాగర్ చుగురోవా వీడియో వైరల్ అయింది. మహారాష్ట్రలోని చిన్నపాటి హోటల్‌కి వెళ్లిన చుగురోవా అక్కడ ఉన్న సూర్యవన్షి అనే మహిళను 'నమస్తే దీదీ' పలకరించి 'ఏం చేస్తున్నారు?' అని అడిగింది. 'పోహా' (అటుకుల ఉప్మా) అని చెప్పింది సూర్యవన్షి.



'నాకు కూడా నేర్పించరా?' అని చుగురోవా అడగగానే ఓకే చెప్పింది సూర్య. సూర్య డైరెక్షన్‌లో టమాటాలు, ఉల్లిగడ్డలు, పచ్చిమిర్చి...మొదలైనవి తరగడం నుంచి పెనంలో వేడి నూనెలో వేయడం వరకు ఎన్నో చేసి 'పోహా' ప్రాజెక్ట్‌ను విజయవంతంగా పూర్తి చేసింది చుగురోవా. ఆ తరువాత 'పోహా తినండి....వోన్లీ ఇరవై రూపాయలు మాత్రమే' అని హిందీలో అరిచింది. 'నమస్తే దోస్తో' కాప్షన్‌తో 'మేకింగ్ పోహా' వీడియోను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసింది చుగురోవా.

మై ఛాయిస్!

భారతీయ మహిళలకు కుర్తాలు ఇష్టమైన దుస్తులు. వృత్తిరీత్యా టీషర్ట్‌లు ధరించడం అందరికీ సౌకర్యం కాకపోవచ్చు. అందుకే 'విమెన్స్ డే' సందర్భంగా జొమాటో తన మహిళా డెలివరీ పార్టనర్లకు ఎర్ర కుర్తాలను బహూకరించింది. ఇకపై వారు డ్యూటీలో నచ్చిన టీ షర్ట్‌గాని, కుర్తా గాని ధరించవచ్చు. ఈ సందర్భంగా చేసిన ప్రమోషన్ యాడ్ ఇంటర్‌నెట్‌లో కుతూహలం రేపుతోంది.

జొమాటోలో దేశమంతా మూడున్నర లక్షల మంది డెలివరీ పార్టనర్లు ఉన్నారు. అంటే ఫుడ్ డెలివరీ చేసే బోయ్‌లు. వీరిలో స్త్రీలు కేవలం 1500 నుంచి 2000 మంది మాత్రమే ఉన్నారు. టూ వీలర్ మీద వేళకాని వేళలో తిరగాల్సి రావడం వల్ల ఇదొక ఛాలెంజింగ్ జాబ్ అయ్యింది మహిళలకు. అయినప్పటికీ సవాలుగా తీసుకుని వందల ఆర్డర్లు డెలివరీ చేస్తున్న జొమాటో మహిళలు ఉన్నారు. వృత్తిరీత్యా వారు టీషర్ట్ ధరించాల్సి ఉంటుంది. అది అందరికీ సౌకర్యం కాకపోవచ్చు. అందుకే జొమాటో మొన్నటి విమెన్స్ డే రోజు కుర్తాలు బహూకరించింది. 'మీ చాయిస్. మీరు టీషర్ట్ వేసుకోవచ్చు లేదంటే కుర్తాలు వేసుకోవచ్చు' అని చెప్పింది. ఇందుకోసం ప్రమోషన్ యాడ్ చేస్తే మహిళా డెలివరీ పార్టనర్‌లు ఉత్సాహంగా పాల్గొన్నారు. 'జేబులున్న కుర్తా నాకు నచ్చింది' అని ఒక మహిళ చెప్పింది. 'ఫోటోలు బాగా తీయండి' అని మరో మహిళ ఉత్సాహపడింది. 'పదండి అందరం మనాలి వెళ్దాం' అని మరో మహిళ ఉత్సాహ పరిచింది. కొత్త ఉపాధి మార్గంలో వెరవక నడిచే వీరందరినీ చూసి నెటిజన్లు హర్షం వ్యక్తం చేశారు. దేశీయ దుస్తుల్లో బాగున్నారంటూ కితాబిచ్చారు.



హెల్త్

ఈ నెల 14న వరల్డ్ కిడ్నీ డే



రకరకాల కిడ్నీ సమస్యలూ... పరిష్కారాలు!

ఇది వేసవి. డీ-హైడ్రేషన్‌కు గురయ్యే కాలం. సాధారణంగా మూత్రపిండాల్లో (కిడ్నీల్లో) రాళ్లు వేసవిలో తరచూ బయటపడుతుంటాయి కాబట్టి ఈ సమస్యకు వేసవిని ఓ సీజన్‌గా పరిగణిస్తుంటారు. పైగా ఈనెల 14వ తేదీ 'వరల్డ్ కిడ్నీ డే' సందర్భంగా మూత్రపిండాల్లో రాళ్లలాంటి సాధారణ సమస్యలు మొదలుకొని, సీకేడీ వంటి మూత్రపిండాలకు సంబంధించిన అనేక సమస్యలూ, వాటి పరిష్కారాలపై అవగాహన కోసమే ఈ కథనాలు.



కిడ్నీలలో రాళ్లు...

కిడ్నీలో రాళ్ల ఎంత సాధారణ సమస్య అంటే ఒకరి 70 ఏళ్ల జీవిత కాలంలో 20% మంది పురుషుల్లో, 10% మంది మహిళల్లో ఏదో ఒక దశలో అవి కనిపిస్తాయి. అయితే రాళ్ల రావడమన్నది పురుషుల్లో ఎక్కువ. వాటి వల్ల కిడ్నీ దెబ్బతిని, కిడ్నీ ఫెయిల్యూర్‌కు దారితీసి, జీవితాంతం డయాలసిస్ మీద ఉండాల్సిన పరిస్థితి వచ్చే ప్రమాదం ఉంది. అందుకే వాటి గురించి తెలుసుకుని, కిడ్నీలో రాళ్లు ఏర్పడేందుకు అవకాశమున్నవారు జాగ్రత్త వహించాల్సిన అవసరముంది.

రాళ్లూ... రకాలు...

మన ఆహారంలో, తాగే పానీయాల్లో క్యాల్షియమ్ వంటి అనేక ఖనిజాలూ, లవణాలు ఉంటాయి. జీవక్రియలు జరిగే సమయంలో ఆగ్జలేట్స్, యూరిక్ యాసిడ్, సిస్టయిన్ వంటి స్ఫటికాలు ఏర్పడవచ్చు. అలాగే ఇంకొందరిలో రాళ్లు రూపొందే ప్రక్రియను అరికట్టే సిట్రేట్‌లు తక్కువగా ఉండవచ్చు. అలాంటివారితో పాటు... నీళ్ల తక్కువగా తాగే వారిలో లవణాలన్నీ ఒకేచోట కేంద్రీకృతమై క్రమంగా గట్టిబడి రాయిలా మారేందుకు అవకాశాలు ఎక్కువ. దేహంలోని వడపోత ప్రక్రియ అంతా కిడ్నీలో జరుగుతుంది కాబట్టి ఇక్కడ రాళ్ల ఏర్పడే అవకాశాలెక్కువ.



కిడ్నీరాళ్లలో ప్రధానమైనవి కాల్షియమ్ ఆగ్జలేట్స్ (70 – 80%). మిగతావి క్యాల్షియమ్ ఫాస్ఫేట్, యూరిక్ యాసిడ్, సిస్టైయిన్స్ వంటివి. ఇక ట్రిపుల్ ఫాస్ఫేట్‌గా పేరున్న మెగ్నీషియమ్, అమోనియమ్ ఫాస్ఫేట్‌లతో తయారయ్యే స్ట్రువైట్ అనే రాళ్లు చాలా అరుదుగా, పెద్దగా ఏర్పడతాయి. దాంతో స్ట్రువైట్ రాళ్లతో కిడ్నీ ఫెయిల్యూర్‌కు అవకాశాలు ఎక్కువ. అంతేకాదు... కొన్నిసార్లు యూరిన్ ఇన్ఫెక్షన్ బాధితుల్లో 'ప్రోటియస్ వల్గారిస్' అనే బ్యాక్టీరియా కారణంగా కూడా స్ట్రువైట్ రాళ్లు ఏర్పడి, మరింత సంక్లిష్టతలకూ, ప్రమాదాలకూ దారితీసే అవకాశముంది.

ఎవరిలో ఎక్కువ...?

◆ నీళ్లు చాలా తక్కువగా తాగేవాళ్లలో ◆ ఉప్పు ఎక్కువగా తీసుకునేవారిలో ◆ మాంసాహారాలూ, చక్కెరలు ఎక్కువగా తినేవారిలో ◆ ఊబకాయం ఉన్నవారిలో ◆ డయాబెటిస్, పేగు వ్యాధులు లాంటి సమస్యలు ఉన్నవారిలో ◆ క్రోన్స్ డిసీజ్, ఇన్‌ఫ్లమేటరీ బవెల్ సిండ్రోమ్, యూరిక్ యాసిడ్ మోతాదులు ఎక్కువగా పెరిగే గౌట్, పాలీసిస్టిక్ కిడ్నీ డిసీజ్, రీనల్ ట్యుబ్యులార్ అసిడోసిస్, హైపర్‌పారాథైరాయిడిజమ్ వంటి సమస్యలున్న వారిలో ◆ సిప్రోఫ్లాక్సిన్ వంటి కొన్ని యాంటీబయాటిక్స్, సల్ఫా డ్రగ్స్, హెచ్‌ఐవీ మందులు వాడే వాళ్లతో పాటు, బరువు తగ్గడానికి బేరియాట్రిక్ సర్జరీ (అందులోనూ రూక్స్-ఎన్-వై గ్యాస్ట్రిక్ బైపాస్) చేయించుకున్నవారిలో.

లక్షణాలు...

నడుము లేదా వీపువైపు ఉరఃపంజరం కింది భాగంలో భరించలేనంత తీవ్రమైన నొప్పి. ఒక్కోసారి ఈ నొప్పి పక్కలకూ, కిందివైపునకూ, పొట్టవైపునకూ, కొందరు పురుషుల్లో వృషణాల సంచివైపునకూ పాకుతుంది. ఇది అలలు అలలుగా వస్తూ పోతూ ఉంటుంది. నొప్పితో పాటు... ◆ వికారం లేదా వాంతులు ◆ జ్వరం ◆ మూత్రంలో రక్తం కనిపించడం ◆ మూత్రవిసర్జనలో మంట ◆ కొందరిలో రాయి కారణంగా మూత్రం వస్తున్న ఫీలింగ్ ఉన్నప్పటికీ, రాయి అడ్డుపడుతుండటం వల్ల మూత్ర విసర్జన జరగకపోవచ్చు. ఇలాంటి వాళ్లలో మూత్రం ఆగి, ఆగి చుక్కలు చుక్కలుగా పడుతుండవచ్చు.

అరుదుగా కొందరిలో ఎలాంటి లక్షణాలూ ఉండవు. కానీ మరేదో సమస్యతో డాక్టర్ దగ్గరికి వచ్చి, పరీక్షలు చేయించినప్పుడు చాలా పెద్దరాయి కారణంగా అప్పటికే కిడ్నీ చాలావరకు చెడిపోయిన సందర్భాలూ ఉన్నాయి.

నిర్ధారణ...

మూత్రపిండాలు, యురేటర్, బ్లాడర్‌ల సీటీ స్కాన్, ఎక్స్-రే, అవసరాన్ని బట్టి అల్ట్రాసౌండ్ స్కానింగ్ వంటి పరీక్షలతో కిడ్నీలో రాళ్లను కనుగొంటారు. కొన్నిసార్లు మూత్రపరీక్ష, కిడ్నీ ఫంక్షన్ పరీక్ష అవసరం కావచ్చు.

చికిత్స...

◆ రోజుకు కనీసం 3 నుంచి 4 లీటర్ల నీరు తాగమని బాధితులకు సూచిస్తుంటారు. దాంతో రాయి రూపొందడానికి వీల్లేకుండా లవణాలు ఎప్పటికప్పుడు మూత్రంలో కొట్టుకుపోవడంతో పాటు... కొన్నిసార్లు రాయి దానంతట అదే బయట పడేందుకు అవకాశముంటుంది.

◆ ఉప్పు, మాంసాహారం తగ్గించమని సూచిస్తుంటారు. అలాగే కొందరిలో రాయి ఏర్పడటానికి దోహదం చేసే పాలకూర, టమాటాకు దూరంగా ఉండమని సూచిస్తారు. ఇది కేవలం కిడ్నీలో రాయి ఏర్పడేందుకు అవకాశమున్నవారికి మాత్రమే. మిగతా ఆరోగ్యవంతులు వీటిని నిరభ్యంతరంగా తీసుకోవచ్చు.

ఇక శస్త్రచికిత్సల విషయానికి వస్తే...

◆ **యురేటరోస్కోపిక్ రిమూవల్ :** ఎండోస్కోప్ సహాయంతో బ్లాడర్‌లోకీ, కిడ్నీ నుంచి బ్లాడర్ వరకు ఉండే నాళాలైన యురేటర్లలోంచి ఈ ప్రక్రియ ద్వారా రాళ్లు తొలగిస్తారు.

◆ **ఎక్స్‌ట్రా కార్పోరియల్ షాక్ వేవ్ లిథోట్రిప్సీ :** రాళ్లు పెద్దవిగా ఉంటే ఈ షాక్ వేవ్స్ సహాయంతో వాటిని చిన్న చిన్న ముక్కలుగా /పౌడర్‌గా పొడిపొడి చేస్తారు. దాంతో రాళ్ల పౌడర్ మూత్రంలో వెళ్లిపోతుంది.

◆ **పర్‌క్యుటేనియస్ నెఫ్రోలిథోటమీ (పీసీఎన్‌ఎల్)** : ఈ ప్రక్రియలో నడుం పక్క భాగం నుంచి కిడ్నీలోకి ఒక పైప్‌ను రాయి ఉన్నచోటికి పంపి, ఆ పైప్ ద్వారా రాయిని బయటకు తీసుకొస్తారు.



డాక్టర్ కిరణ్ కుమార్ ముక్కు,
కన్సల్టెంట్ నెఫ్రాలజిస్ట్.

క్రానిక్ కిడ్నీ డిసీజ్ -సీకేడీ

క్రానిక్ కిడ్నీ డిసీజ్ (సీకేడీ)కి మొదటి కారణం మధుమేహం, రెండోది దీర్ఘకాలిక రక్తపోటు. మూడో కారణం గ్లోమరులార్ డిసీజ్. ఈ సమస్య ఉన్నవారిలో మూత్రంలో ప్రోటీన్ ఎక్కువగా పోతుంటుంది. ఫలితంగా కాళ్లవాపు, ముఖం వాచినట్లుగా ఉండటం, మూత్రం నురగలా రావడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. కొందరిలో కారణాలేమీ లేకుండానే కిడ్నీలు దెబ్బతిన వచ్చు. కిడ్నీలోని మూత్రనాళాలను దెబ్బతీసే ఇంటస్టిషియల్ వ్యాధులు, కొన్ని జన్యుపరమైన జబ్బులు, ఇన్ఫెక్షన్లు, కొన్నిసార్లు కిడ్నీలో రాళ్లు కూడా క్రానిక్ కిడ్నీ డిసీజ్ (సీకేడీ)కి కారణం. అయితే ఈ కారణాలన్నింటిలోనూ డయాబెటిస్, హైబీపీ వల్లనే 70– 80 శాతం కిడ్నీవ్యాధికి దారితీస్తాయి.

ఎవరెవరిలో... ఎందువల్ల : చిన్నపిల్లల్లో సీకేడీ ఉందంటే అది జన్యుపరమైన జబ్బుల వల్ల వచ్చిందేమోనని చూడాలి. మధ్యవయసు వారిలోనైతే... ఇందుకు అదుపులో లేని డయాబెటిస్, అధిక రక్తపోటు కారణమని అనుమానించాలి.



డయాలసిస్ ప్రతీకాత్మక చిత్రం

లక్షణాలు : వికారం / ఆగకుండా వాంతులు ◆ ఎప్పుడూ నీరసంగా ఉండటం, ◆ కాళ్లవాపులు, ◆ ముఖం వాపు, ◆ ఆకలి తగ్గడం ◆ ఊపిరి అందకపోవడం / ఆయాసం ◆ రాత్రివేళ మూత్రం కోసం ఎక్కువగా నిద్రలేవాల్సి రావడం, మూత్రం చుక్కలు చుక్కలుగా తక్కువగా రావడం, ◆ మూత్రంలో రక్తస్రావం... వంటి లక్షణాలు ఉంటాయి. ఇవన్నీ కిడ్నీలు 50 శాతం దెబ్బతిన్న తర్వాతే బయటపడవచ్చు.

చికిత్స : క్రమం తప్పకుండా డయాలసిస్ చేయించుకోగలిగినప్పుడు కిడ్నీ బాధితులు ఓ సాధారణ వ్యక్తి జీవించినంత కాలం జీవించవచ్చు. డయాలసిస్‌లో రెండు రకాలు. మొదటిది హీమో డయాలసిస్; రెండోది పెరిటోనియల్ డయాలసిస్.

హీమో డయాలసిస్ : ఇది యంత్రం ద్వారా రక్తాన్ని శుద్ధి చేసే ప్రక్రియ. వారానికి మూడు సార్లు రోజు విడిచి రోజు డయాలసిస్ కేంద్రానికి వెళ్లి చేయించుకోవాలి. ఈ ప్రక్రియకు నాలుగు గంటలు పడుతుంది.

పెరిటోనియల్ డయాలసిస్: ఇది ఇంట్లోనే చేసుకునే డయాలసిస్. దీన్నే 'కంటిన్యువస్ అంబులేటరీ పెరిటోనియల్ డయాలసిస్' (సీఏపీడీ) అని కూడా అంటారు.

కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్స : కిడ్నీ తొంభై శాతం పాడైనప్పుడు మాత్రమే కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సను చివరి ఆప్షన్‌గా డాక్టర్లు సూచిస్తారు.

కిడ్నీలను పదిలంగా కాపాడుకోవాలంటే...



◆ డయాబెటిస్, హైబీపీ ఉన్నవారు కచ్చితంగా వాటిని నియంత్రణలో ఉంచుకోవాలి. మధుమేహం ఉన్నవారు మూడు నెలలకోసారి హెచ్‌బీఏ1సీ పరీక్షను చేయిస్తూ... రీడింగ్స్ 6.5 కంటే తక్కువగా ఉండేలా చూసుకోవాలి. హైబీపీ ఉన్నవారు తమ బీపీని 130/80 ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి. ◆ రక్తంలో కొవ్వులు, కొలెస్ట్రాల్ పెరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఇందుకు కొవ్వులు ఎక్కువగా ఉండే మాంసాహారం తక్కువగా తీసుకుంటూ... శాకాహారం, ఆకుకూరలను ఎక్కువగా తీసుకోవాలి. ◆ మన ఆహారంలో ఉప్పును చాలా తక్కువగా తీసుకోవాలి. ఉప్పు ఎక్కువ మోతాదులో ఉండే బేకరీ ఐటమ్స్, పచ్చళ్లు, అప్పడాలు, నిల్వ ఆహారాలకు దూరంగా ఉండాలి. ◆ ఆగ్జలేట్స్ ఎక్కువగా ఉండే గింజ ధాన్యాలు, సోయాబీన్స్, చాక్లెట్ల వంటి వాటిని తగ్గించాలి. ◆ క్యాల్షియం సప్లిమెంట్లను కూడా తగిన మోతాదులో ఉండేలా చూసుకోవాలి. అలాగే క్యాల్షియం సిట్రేట్‌కు కిడ్నీలో రాళ్లు ఏర్పడకుండా నివారించే లక్షణం ఉంది. నిమ్మజాతి పండ్లు, ఆరెంజ్ జ్యూస్ వంటివాటివి డాక్టర్ల సూచనల మేరకు తీసుకోవాలి. ◆ అధిక బరువు ఉన్నవారు బరువు తగ్గించుకోవాలి. ◆ పొగతాగడం పూర్తిగా మానేయాలి. ◆ ఆల్కహాల్ వల్ల ఎక్కువసార్లు మూత్రవిసర్జనకు వెళ్లాల్సి వస్తుంది. దాంతో దేహంలో నీళ్లు తగ్గి డీహైడ్రేషన్‌కు గురవుతాయి. ఇవి మూత్రపిండాల్లో రాళ్లు ఏర్పడడానికి అవకాశమిస్తుంది. కాబట్టి ఆల్కహాల్ పూర్తిగా మానేయాలి. కూల్‌డ్రింక్స్‌కూ దూరంగా ఉండటం మంచిది. ◆ ఏవైనా మందులు లేదా విష పదార్థాలు ఒంట్లోకి రాగానే వాటిని విరిచేసి, వడపోసి బయటకు పంపే బాధ్యతలు కాలేయం, కిడ్నీలవే. నొప్పి నివారణ మందుల వంటి కొన్ని ఔషధాలు దీర్ఘకాలంలో కిడ్నీలను దెబ్బతీసే అవకాశం ఉన్నందున డాక్టర్ సలహాలు, సూచనలు లేకుండా ఏ రకమైన 'ఆన్ కౌంటర్ డ్రగ్స్' వాడకూడదు. ◆ మూత్రం ఇన్ఫెక్షన్స్‌ని సరైన పద్ధతిలో, సరైన మందులతో, సరైన సమయంలో వైద్యం చేయించుకుని, పూర్తిగా తగ్గేలా చూసుకోవాలి.

